క్లుప్తంగా

ఆశా యాప్‌పై అవగాహన కల్పించాలి



పీహెచ్‌సీలో వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో హేమంత్

పాయకరావుపేట : వైద్య సిబ్బంది అందరూ ఈ ఆశా యాప్‌పై అవగాహన కల్పించాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ హేమంత్ అన్నారు. ఆయన మంగళవారం పట్టణంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించారు. ఆశా డే కార్యక్రమంలో భాగంగా ఆశాలు అందరికీ ఈ– ఆశా యాప్ పై అవగాహన కల్పించాలన్నారు. అదే విధంగా జాతీయ డెంగ్యూ నివారణ మాసోత్సవాల్లో భాగంగా జూలై 30 వరకూ ప్రతి సచివాలయలో అవగాహన ర్యాలీలు నిర్వహించాలన్నారు. పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ బి.వి ద్యాసాగర్, డాక్టర్ వి.పద్మప్రియ, ఎంపీహెచ్‌వో రమణ, ఎంపీహెచ్‌ఎస్ నాగేశ్వరరావు, పిహెచ్ ఎన్ శాంతిరత్నం పాల్గొన్నారు.

నేడు కొరుప్రోలు, సర్వసిద్ధిలో జగనన్న సురక్ష

ఎస్.రాయవరం : జగనన్న సురక్ష కార్యక్రమం బుధవారం కొరుప్రోలు, సర్వసిద్ధి గ్రామాల్లో నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో రామచంద్రమూర్తి తెలిపారు. ఎంపీడీవో బృందం కొరుప్రోలు, తహసీల్దార్ బృందం సర్వసిద్ధిలోనూ అందుబాటులో ఉంటారన్నారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో సేకరించిన దరఖాస్తులకు బుధవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉండి పరిష్కారం చూపుతారన్నారు. కుల, ఆదాయ ధ్రువీకరపత్రాలు లబ్ధిదారులకు నేరుగా అందిస్తూ 11 రకాల సేవలు అందిస్తారన్నారు.

కేజీహెచ్‌కి వెళ్లి పింఛను అందజేత



కేజీహెచ్‌లో వృద్ధురాలికి పింఛను ఇస్తున్న గ్రామ వలంటీర్

పాయకరావుపేట : పాయకరావుపేట గ్రామ సచివాలయం 1 పరిధిలో గల మహిళకు విశాఖపట్నం కేజీహెచ్‌కి వెళ్లి పింఛను పంపిణీ చేసినట్టు గ్రామ వలంటీర్ జి.అచ్చికాంతం తెలిపారు. గ్రామానికి చెందిన భీమవరపు కాంతం కొంతకాలంగా అనారోగ్యం కారణంగా కేజీహెచ్‌లో వైద్యం పొందుతున్నారని, అందువల్ల విశాఖపట్నం వెళ్లి ఆమెకు పింఛను అందజేసినట్టు గ్రామ వలంటీర్ అచ్చికాంతం తెలిపారు.

ఎంఈవోను కలిసిన ఉపాధ్యాయ ప్రతినిధులు



ఎంఈవోను కలసి అభినందనలు తెలుపుతున్న ఉపాధ్యాయులు

నక్కపల్లి : నూతన ఎంఈవోగా నియమితులైన కుంచం నరేష్‌ను మండలంలో వివిధ ఉపాధ్యాయ సంఘ ప్రతినిధులు మంగళవారం కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన ఉపాధ్యాయుల సమస్యలు తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానన్నారు. బదిలీపై వెళ్లేవారికి వెంటనే ఎల్‌పీసీలు ఇచ్చేలా చూస్తానన్నారు. పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపరిచేందుకు ఉపాధ్యాయులంతా సమష్టిగా కృషి చేయాలని సూచించారు. ఎంఈవోను కలిసిన వారిలో సంఘ నేతలు సన్యాసిరావు, ఎ.వి.ఎస్.ఆచార్యులు, చోడిశెట్టి సత్యనారాయణ, సుందరరావు, ప్రసాద్, రమేష్, రమణ, ఆచార్యులు నాగేశ్వరరావు ఉన్నారు.

పట్టుబడ్డ పీడీఎస్ బియ్యానికి బహిరంగ వేలం

నక్కపల్లి : మండలంలో వివిధ ప్రాంతాల్లో పట్టుబడ్డ పీడీఎస్ బియ్యానికి (రేషన్ డిపోల ద్వారా సరఫరా చేసే) మంగళవారం బహిరంగ వేలం నిర్వహించారు. గడచిన రెండేళ్ల నుంచి వివిధ ప్రాంతాలు, రైసు మిల్లుల్లో నిల్వ చేసిన, అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని అధికారులు దాడులు నిర్వహించి పట్టుకున్నారు. ఇలా పట్టుబడ్డ బియ్యం సుమారు 60 టన్నులు ఉంది. ఈ బియ్యాన్ని నక్కపల్లి పౌరసరఫరాలశాఖ గోదాములో ఉంచారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ బియ్యాన్ని మంగళవారం తహసీల్దార్ అంబేద్కర్, సీఎస్ డీటీ అప్పల నాయుడు బహిరంగ వేలం వేయడంతో చోడవరం ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తికిలో రూ.23 చొప్పున దక్కించుకున్నారు. సుమారు రూ.14 లక్షల రూపాయలు ప్రభుత్వానికి ఆదాయం లభించింది.

తెలుగోడి పౌరుషాన్ని చాటిన అల్లూరి

- ఎమ్మెల్యే గొల్ల బాబూరావు
- ఎంపీడీవో కార్యాలయంలో అల్లూరి విగ్రహావిష్కరణ



నక్కపల్లి ఎంపీడీవో కార్యాలయంలో అల్లూరి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు



రాజా వెంకటనగరంలో అల్లూరికి నివాళులు అర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

నక్కపల్లి : రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడ గడ లాడించి తెలుగు వాడి పౌరుషాన్ని తెల్లదొరలకు రుచి చూపించిన మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జ్ఞాపకాలు ప్రతి ఒక్కరి మదిలో ఎప్పటికీ నిలిచిపోతాయని పాయకరావుపేట మాజీ ఎమ్మెల్యే గొల్ల బాబూరావుఅన్నారు. మంగళవారం నక్కపల్లి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో వేంపాడుకు చెందిన క్షత్రియ సేవాసంఘం వారు అల్లూరి 125వ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేసిన అల్లూరి విగ్రహాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం తీసుకు రావడం కోసం అల్లూరి ప్రాణాలను పణంగా పెట్టారన్నారు. గిరిజన ప్రాంతాలకు దేవుడిగా వారి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. ఆ మహనీయుడి సేవలను గుర్తించిన జగనన్న ప్రభుత్వం పాడేరు కేంద్రంగా కొత్త జిల్లా ఏర్పాటు చేసి అల్లూరి సీతారామరాజు జిల్లాగా నామకరణం చేసిందన్నారు. మహాత్మాగాంధీ అంబేద్కర్ విగ్రహాల సరసన ఏర్పాటు చేసిన అల్లూరి విగ్రహాన్ని ఆవిష్కరించడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. తుని మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబు మాట్లాడుతూ తుని, పాయకరావుపేట ప్రాంతాలతో అల్లూరి సీతారామరాజుకు అనుబంధం ఉందన్నారు. తునిలోనే ఆయన విద్యాభ్యాసం చేశారన్నారు. బ్రిటిష్ ప్రభుత్వంపై ఆయన చేసిన సాయుధ పోరాటం చరిత్రలో నిలిచిపోయిందన్నారు. కేంద్ర ప్రభుత్వం అల్లూరి 125వ జయంతి ఉత్సవాలను ఏడాది పాటు నిర్వహించడం, హైదరాబాద్‌లో నిర్వహిస్తున్న ముగింపు కార్యక్రమానికి భారత రాష్ట్రపతి రావడం గర్వంగా ఉందన్నారు. జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ మాట్లాడుతూ బ్రిటిష్ వారిపై గెరిల్లా యుద్ధతంత్రాలతో గడ గడ లాడించిన అల్లూరి సీతారామరాజు ఈ ఒక్క కులానికో, మతానికో, సమాజానికో పరిమితం కారాదన్నారు. అల్లూరి ప్రతి ఒక్క దేశ పౌరుడికి సొంతమన్నారు. పాయకరావుపేటలో కూడా అల్లూరి విగ్రహం ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తామన్నారు. అల్లూరి జయంతిని సెలవుదినంగా ప్రకటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఎఫ్‌యుఐడీసీ డైరెక్టర్ వీసం రామకృష్ణ , ఎంపీపీ ఏనుగుపల్లి రత్నం, జెడ్పీటీసీ గోసల కాసులమ్మ, జీసీఆర్ ఫౌండేష్ అధినేత గెడ్డం బుజ్జి, వైస్ ఎంపీపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, దత్తుడు సీతబాబు, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు అయినంపూడి మణిరాజు, సర్పంచ్‌లు చినపేర్రాజు, రత్నకుమారి, ఏడిద నూకరత్నం, క్షత్రియ సేవా సంఘ ప్రతినిధులు సత్యనారాయణరాజు, బాబ్జిరాజు, నాగులరాజు, పెంకులరాజు, శ్రీపతిరాజు, మాజీ జెడ్పీటీసీలు కొండబాబు, కె. నూకరాజు, కె.వెంకటేష్, పీఏసీఎస్ అధ్యక్షుడు తాతబాబు, స్థానిక నాయకులు శీరం నర్సింహమూర్తి, తళ్ల భార్గవ్, సురేష్‌వర్మ, ఎంపీటీసీలు తిరుపతిరావు, గోవిందు, బలరామరాజు పాల్గొన్నారు.

రాంబిల్లి : మండలంలో మంగళవారం విప్లవ వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. రాంబిల్లిలో ఎంపీపీ జి.శిరీషశ్రీను బాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, ప్రభాస్ ఫ్యాన్స్ అధ్యక్షుడు వర్మరాజు, పలువురు క్షత్రియ నాయకులు అల్లూరి విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అలాగే దిమిలి శాఖా గ్రంథాలయంలో లైబ్రేరియన్ ఎస్.శకుంతల, సచివాలయ సిబ్బంది అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

అచ్యుతాపురం(అనకాపల్లి): మండలంలోని పలు గ్రామాల్లో మంగళవారం మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలు ఘనంగా జరిపారు. స్వాతంత్ర్య సంగ్రామంలో అల్లూరి పోరాట పటిమను వక్తలు కొనియాడారు. మోసయ్యపేటలో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి కె.సోమునాయుడు, వార్డెన్ గిరిరాజు, అడిగర్ల శంకర్‌రావు పాల్గొన్నారు. క్రైట్స్ కాలేజీలో అల్లూరి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కళాశాల కరస్పాండెంట్ రెడ్డి చిరంజీవి, అచ్యుతాపురం బీజేపీ కార్యాలయంలో నూతన మండల అధ్యక్షుడు కూండ్రపు నాయుడుబాబు ఆధ్వర్యంలో అల్లూరి జయంతిని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాజాన రాజు, మేరుగు కాసుబాబు, యండపల్లి రాజు పాల్గొన్నారు.

అల్లూరి ఆశయ సాధనకు పాటుపడాలి

మునగపాక : స్వాతంత్ర్య సమరయోధుడు అల్లూరి ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కాకరాపల్లి సర్పంచ్ కొల్లి మునిలినాయుడు పిలుపునిచ్చారు. మంగళవారం కాకరాపల్లి ప్రాథమిక పాఠశాలలో అల్లూరి సీతారామరాజు జయంతి వేడుకలను నిర్వహించారు.అల్లూరి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్వాతంత్ర్య సంగ్రామంలో అల్లూరి పాత్ర ఎంతో కీలకమైందన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఇల్లా శిరీషా నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: మండలంలోని గుర్రాజుపేట, రాజావెంకటనగరం, గుడివాడ, పి.ధర్మవరం గ్రామాల్లో అల్లూరి జయంతిని ఘనంగా నిర్వహించారు. అల్లూరి ఆశయ సాధనకు కృషి చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకుడు రామరాజు అన్నారు. ఆయా గ్రామాల్లో ఉన్న అల్లూరి విగ్రహాలకు పూలమాల వేసి నివాళులు అర్పించారు. పి.ధర్మవరం గ్రామంలో సీపీఎం నాయకుడు ఎం.అప్పలరాజు, గుడివాడలో వైఎస్సార్‌సీపీ నాయకులు చంటిరాజు, అచ్చురామరాజు, శ్రీపతిరాజు, వర్మరాజు తదితరులు అల్లూరికి నివాళులు అర్పించారు.



మోసయ్యపేటలో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం



రాంబిల్లిలో అల్లూరి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న క్షత్రియ నాయకులు



విద్యార్థులకు పుస్తకాల పంపిణీ చేస్తున్న దృశ్యం

జగనన్న సురక్ష సమస్యల పరిష్కారానికి వేదిక

- ఎమ్మెల్యే కన్నబాబురాజు
- పులపర్తిలో ధ్రువీకరణ పత్రాలు పంపిణీ



మునగపాక మండలంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు



పులపర్తి గ్రామంలో లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే రమణమూర్తిరాజు

యలమంచిలి : జగనన్న సురక్ష ప్రజల సమస్యల పరిష్కారానికి చక్కటి వేదిక అని ఎమ్మెల్యే కన్నబాబురాజు అన్నారు. మంగళవారం యలమంచిలి మండలం పులపర్తి గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా లబ్దిదారులకు ధ్రువీకరణపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాల్లో ప్రతి ఒక్కరూ సమస్యలను వలంటీర్లు సచివాలయ అధికారులు వారి నుంచి నేరుగా తెలుసుకొని వెంటనే వాటి పరిష్కారానికి చొరవ చూపాలని అన్నారు. అనంతరం అర్జీదారులకు వివిధ ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమార వర్మ, ఎంపీడీవో అప్పలనాయుడు, సేనాపతి రాము, మండల ప్రత్యేకాధికారి లక్ష్మణరావు, సర్పంచ్ కొండబాబు, మాజీ జెడ్పీటీసీ యర్రయ్యదొర, ఎంపీటీసీ నూకేశ్వరరావు, రేగుపాలెం సర్పంచ్ రాజాన మహాలక్ష్మి, రూరల్ వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కొల్లి త్రినాథ్, మండల విస్తరణ అధికారి ప్రసాద్ పాల్గొన్నారు.

మెలిపాక, గణపర్తిలో ధ్రువపత్రాల పంపిణీ

మునగపాక : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సేవలు అందించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే రమణమూర్తి రాజు అన్నారు. మండలంలోని మెలిపాక,గణపర్తి గ్రామాల్లో మంగళవారం జగనన్న సురక్ష కార్యక్రమంలో భాగంగా ఆయన లబ్దిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. అర్హులై ఉండి ఇంతవరకు ఎటువంటి సంక్షేమ పథకాలు అందనివారికి ఈ కార్యక్రమం దోహదపడుతుందన్నారు. డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ, సర్పంచ్‌లు భాస్కరరాజు, చదరం నాయుడు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, జెడ్పీటీసీ స్వామి సత్యనారాయణ, సచివాలయ కన్వీనర్‌లు అప్పలనాయుడు,అప్పారావు, డీఎల్‌డీవో మంజులావాణి,ఎంపీడీవో మన్మథరావు,తహసీల్దార్ ప్రకాశరావు ఈవోఆర్డీ ఈశ్వరరావు పాల్గొన్నారు.

వలంటీర్లపై ఫిర్యాదులొస్తే తొలగిస్తాం

ఎమ్మెల్యే కన్నబాబు రాజు



ఎమ్మెల్యే కన్నబాబు రాజు సమక్షంలో ధ్రువపత్రాలు అందజేస్తున్న దృశ్యం

అచ్యుతాపురం (అనకాపల్లి): ప్రజలకు సేవలందించేందుకే వలంటీర్లు ఉన్నారని, ఎక్కడైనా వలంటీర్లపై ఫిర్యాదులొస్తే కఠిన చర్యలు తప్పవని యలమంచిలి ఎమ్మెల్యే ఉప్పలపాటి రమణమూర్తిరాజు అన్నారు. అచ్యుతాపురం మండలంలోని చీమలాపల్లి, చోడపల్లి గ్రామాల్లో జగనన్న సురక్ష సమావేశాల్లో ఆయన పాల్గొన్నారు. వలంటీర్లు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా ప్రజలకు అవసరమైన ధ్రువ పత్రాలను అందజేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి ఈ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని తెలిపారు. ఎవరికి ఎటువంటి అవసరం వచ్చినా నేరుగా తనకు ఫోన్ చేయవచ్చని తెలిపారు. ఎంపీపీ కోన బుజ్జి, జెడ్పీటీసీ లాలం రాంబాబు, కో ఆప్షన్ జెడ్పీటీసీ నర్మాల కుమార్ పాల్గొన్నారు.

పారిపల్లెమ్మను దర్శించుకున్న బొడ్డేడ



పారిపల్లెమ్మ అమ్మవారిని దర్శించుకుంటున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ప్రసాద్

మునగపాక : వాడ్రాపల్లిలో పారిపల్లెమ్మ అమ్మవారిని మంగళవారం వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్ దర్శించుకున్నారు. వాడ్రాపల్లి గ్రామ ఉత్సవ కమిటీ అధ్యక్షుడు కన్నుంనాయుడు తన మొక్కులో భాగంగా అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ ప్రసాద్‌ను దుశ్సాలువాతో సత్కరించారు. సర్పంచ్ కాండ్రేగుల నూకరాజు, వైఎస్సార్‌సీపీ నేతలు చిన్నారావు, రామజోగినాయుడు, దశావతారం, భాస్కరరావు, రవీంద్ర, ద్వారపురెడ్డి బాబ్జీ, జగన్ కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికి సంక్షేమ లబ్ధి



గొల్లపేటలో ఇంటింటికీ తిరుగుతున్న ఎమ్మెల్యే బాబూరావు

కోటవురట్ల : జగనన్న పాలనలో ప్రతి కుటుంబానికి సంక్షేమ లబ్ధి కలుగుతోందని ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. కోటవురట్ల సచివాలయం–2 పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు ఇంటింటికి వెళ్లి సమస్యలు తెలుసుకున్నారు. నవరత్నాలు ప్రతి కుటుంబంలో వెలుగులు నింపుతున్నాయని, రైతులు, చిరు వ్యాపారులు, కులవృత్తుల వారు, మహిళలు సగౌరవంగా బతుకుతున్నారన్నారు. ఈ సంక్షేమ పథకాలు మరింత మెరుగ్గా అందాలంటే మళ్లీ జగన్‌కు అవకాశం ఇవ్వాలన్నారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి సీతారామరాజు, జెడ్పీటీసీ ఉమాదేవి, సర్పంచులు అనిల్‌కుమార్, కోసూరు అప్పారావు, కె.వరహాలబాబు, గోపాలకృష్ణ, శివకుమార్, జగదీష్, పావని, ఎంపీటీసీలు రాంబాబు, రాంబాబు, ఉప సర్పంచ్ రాధాకృష్ణ, పార్టీ నాయకులు సత్యనారాయణ, నారాయణమూర్తిరాజు, శ్రీనివాసరావు, చిట్టిబాబు, బాలేపల్లి సత్యనారాయణ, శేఖర్, దొడ్డి రమేష్, కొరుప్రోలు రమణ, కిషోర్, రమణమూర్తి, రామునాయుడు, వెంకట్, నీలేంద్రరావు, సోషల్ మీడియా కన్వీనర్ గోపాలకృష్ణ, ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, డీటీ సోమశేఖర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ లక్ష్యాల మేరకు పనిచేయాలి



ఎంఈవో 1 అప్పారావుని సత్కరిస్తున్న దార్లపూడి ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం : ప్రభుత్వ పాఠశాలలో విద్య పట్ల ప్రభుత్వ నిర్ణయాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు పని చేయాలని ఎంఈవో పి.అప్పారావు అన్నారు. మండలంలో నియమితులైన అప్పారావు మంగళవారం దార్లపూడి ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందుతున్న సదుపాయాలు, విద్యాబోధన పరిశీలించారు. ఉపాధ్యాయులు ఎంఈవోని ఘనంగా సత్కరించారు.

హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి



మాట్లాడుతున్న సమరసత సేవా ఫౌండేషన్ సబ్‌డివిజన్ ధర్మ ప్రచారకుడు అప్పారావు

మునగపాక : హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని సమరసత సేవా ఫౌండేషన్ సబ్‌డివిజన్ ధర్మ ప్రచారకుడు కొల్లి అప్పారావు కోరారు. మంగళవారం సంతబయిల రామాలయంలో ఫౌండేషన్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేవాలయాల్లో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించేందుకు గ్రామ ధార్మిక కమిటీలు అవసరమన్నారు. ప్రతి నెలా దేవాలయం కేంద్రంగా సామూహిక హారతి, ఏకాదశి నాడు నగర సంకీర్తన వంటి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఫౌండేషన్ మండల కన్వీనర్ ఆడారి లక్ష్మణరావు, సత్యనారాయణ పాల్గొన్నారు.

జగనన్న పాలనలో రైతులకు ప్రాధాన్యం



పాటిపల్లి ఆర్‌బీకేలో విత్తనాలను అందజేస్తున్న సర్పంచ్ కృష్ణవేణి త్రిమూర్తులు

మునగపాక : సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రైతులకు ఎంతో ప్రాధాన్యం దక్కిందని పాటిపల్లి సర్పంచ్ ఆడారి కృష్ణవేణి త్రిమూర్తులు అన్నారు. మంగళవారం పాటిపల్లి ఆర్‌బీకేలో రైతులకు రాయితీపై విత్తనాలు అందజేశారు. ఈ సందర్భంగామాట్లాడుతూ రైతులకు సీజన్‌లో విత్తనాలు, ఎరువులను అందజేస్తున్నామన్నారు. కౌలు రైతులకు కూడా రైతు భరోసా వంటి సేవలందుతాయన్నారు. సచివాలయ కన్వీనర్ సరిశా శ్రీనివాసరావు, వార్డు సభ్యులు యల్లపు వెంకటి, నాగేశ్వరరావు, గ్రామశాఖ అధ్యక్ష, కార్యదర్శులు శరగడం శ్రీనివాసరావు, భీశెట్టి లక్ష్మణరావు, వీఏఏ మంజుష పాల్గొన్నారు.

నేడు దేవవరం, చందనాడలలో జగనన్న సురక్ష

నక్కపల్లి : మండలంలో బుధవారం దేవవరం, చందనాడ గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు ఎంపీడీవో సీతారామరాజు తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే గొల్ల బాబూరావు హాజరవుతారన్నారు. అర్జీదారులకు గ్రామసభల్లో ధ్రువపత్రాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. దేవ వరంలో రూ.10 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రాన్ని ఎమ్మెల్యే ప్రారంభిస్తారని, రూ.10 లక్షలు ఎంపీ నిధులతో నిర్మించే ఎస్సీ కమ్యూనిటీ భవనానికి శంకుస్థాపన చేస్తారని సర్పంచ్ గొర్ల రాఘవ కుమారి తెలిపారు.

జెడ్పీ నిధులతో బోర్ల నిర్మాణం



బోర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న జెడ్పీటీసీ లంక సూర్యనారాయణ

పాయకరావుపేట : జిల్లా పరిషత్ నిధులతో మండలంలో పలు గ్రామాల్లో తాగునీటి సరఫరాకు చేతి బోర్ల నిర్మాణం చేపడుతున్నట్టు జెడ్పీటీసీ లంక సూర్యానారాయణ తెలిపారు. మండలంలోని కందిపూడి, రాజగోపాలపురం, గోపాలపట్నం గ్రామాలు, పాయకరావుపేట పట్టణంలోని రాజీనగర్ కాలనీ, బృందావనం, లింగాల కాలనీ, అంబేద్కర్ కాలనీ మండల పరిషత్ కాంప్లెక్స్ ఆవరణలోను బోర్ల నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. రూ.7 లక్షలతో ఈ బోర్లు నిర్మిస్తున్నట్టు తెలిపారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో బోరు నిర్మాణానికి జెడ్పీటీసీ సూర్యనారాయణ శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, పంచాయతీ సభ్యులు నూకరత్నం, లోవరాజు, పల్లా ప్రసాద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ మనోజ్ కల్యాణ్ పాల్గొన్నారు.

బడుగు వర్గాల ఆశాజ్యోతి వంగవీటి రంగా



వంగవీటి రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు



యలమంచిలిలో రంగా చిత్రపటానికి పూలమాల వేస్తున్న అభిమానులు



నక్కపల్లిలో రంగా చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

పాయకరావుపేట : దివంగత వంగవీటి మోహనరంగా బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అని, ప్రజా సమస్యలపై పోరాటంలో తన ప్రాణాలను సైతం అర్పించిన మహనీయుడు అని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేష్ అన్నారు. వంగవీటి రంగా 76వ జయంతి సందర్భంగా పట్టణంలో గల జి.వి.ఆర్.నగర్‌లో వున్న వంగవీటి విగ్రహానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కాపునాడు ఉపాధ్యక్షుడు జగతా శ్రీను, ఏఎంసీ వైస్ చైర్మన్ గూటూరు శ్రీను, పంచాయతీ ఉపసర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పాండురంగ దేవస్థానం మాజీ చైర్మన్ యాళ్ళ వరహాలు, రైతు సంఘం నాయకుడు సత్యనారాయణ, పలువురు కాపునాడు, కాపు సంఘం నాయకులు పాల్గొన్నారు.

యలమంచిలి : పట్టణంలో రైల్వేస్టేషన్ రోడ్డులో వంగవీటి మోహనరంగా 76వ జయంతి వేడుకలు మంగళవారం వంగవీటి అభిమానులు ఘనంగా నిర్వహించారు. రంగా చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. వంగవీటి పేద ప్రజల అభ్యున్నతికి ఎంతో తోడ్పాటునందించారని, ముఖ్యంగా కాపుల ఉన్నతికి అన్ని విధాలుగా కృషి చేశారని పలువురు కొనియాడారు. కార్యక్రమంలో కరణ శ్రీహరి (అడ్వకేట్) నగిరెడ్డి గణేష్, నానేపల్లి నరేష్, కొఠారు నరేష్, అడపా శేషగిరి, నక్కా వెంకటరమణ, తాటిపాకల నాని, ఆకుల వెంకటేష్, పిళ్లా రాజు పాల్గొన్నారు.

నక్కపల్లి : కాపు నేత దివంగత మాజీ ఎమ్మెల్యే వంగవీటి మోహన్‌రంగా జయంతిని మండలంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. నక్కపల్లిలో ఆర్‌టీసీ కాంప్లెక్స్ వద్ద రంగా చిత్రపటానికి, విగ్రహానికి ఏపీ పట్టణ ఆర్థిక మౌలిక సదుపాయాల అభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ, మండల పార్టీ అధ్యక్షుడు పొడగట్ల పాపారావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. రంగా ఒక్క కాపులకే పరిమితం కాదని, బలహీన వర్గాల వారందరికీ చెందిన వ్యక్తి అన్నారు. ఉద్దండపురంలో రంగా విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు యువకులు రక్త దానం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ స్టూడెంట్ విభాగం జిల్లా అధ్యక్షుడు కొప్పిశెట్టి హరిబాబు, సర్పంచ్ పొడగట్ల వెంకటేష్, స్థానిక నాయకులు కొప్పిశెట్టి వెంకటేష్, అల్లాడ కొండబాబు, మీగడ సత్తిబాబు, ముద్దాసన్ని, కొల్నాటి బుజ్జి, వీసంరాజు పాల్గొన్నారు.



వంగవీటి రంగా విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న దృశ్యం

ఎస్.రాయవరం : బడుగుల ఆశాజ్యోతిగా వంగవీటి రంగా పేరు చిరస్థాయిగా నిలిచిపోయిందని రంగా అభిమానులు పేర్కొన్నారు. వంగవీటి రంగా జయంతిని పురస్కరించుకుని ఎస్.రాయవరంలో ఆయన విగ్రహానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంచారు.

నేడు సచివాలయ భవనాలకు ప్రారంభోత్సవం



ప్రారంభోత్సవానికి సిద్ధంగా ఉన్న మునగపాక-1, 2 సచివాలయాలు

మునగపాక : మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన సచివాలయాలను బుధవారం ఎమ్మెల్యే రమణమూర్తిరాజు చేతుల మీదుగా ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మునగపాక–1,2 సచివాలయాలను రూ.40 లక్షల వంతున రూ.80 లక్షలకు పైగా నిధులు వెచ్చించి నిర్మాణాలు చేపట్టారు. అధికారుల పర్యవేక్షణలో పనులు పూర్తయ్యాయి. మునగపాక బైపాస్ రోడ్డును ఆనుకొని నిర్మించిన ఈ భవనాలు రంగులతో సుందరంగా దర్శనమిస్తున్నాయి. కార్యక్రమానికి ఎమ్మెల్యే రమణమూర్తిరాజుతో పాటు ఎంపీ డాక్టర్ భీశెట్టి వెంకట సత్యవతి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు బొడ్డేడ ప్రసాద్, డీసీసీబీ మాజీ చైర్మన్ సుకుమారవర్మ హాజరుకానున్నారు. భవన ప్రారంభోత్సవాలకు పార్టీ శ్రేణులు తరలిరావాలని పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు తెలిపారు.